క్లుప్తంగా

విధులు నిర్వర్తిస్తుండగానే ఆర్‌ఐకి పక్షవాతం

కడెం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పని చేస్తున్న తక్కన్న బుధవారం విధులు నిర్వర్తిస్తుండగానే పక్షవాతంతో కిందపడ్డాడు. రెవెన్యూ అధికారులు గమనించి హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కార్యాలయంలో తక్కన్న, లక్ష్మణ్ ఇద్దరు ఆర్‌ఐలు ఉండగా లక్ష్మణ్ డెప్యూటేషన్‌పై ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాడు. ఉన్న ఒక ఆర్‌ఐపై పనిభారం పడుతుంది. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయానికి పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాలని రెవెన్యూ ఉద్యోగులు కోరుతున్నారు.

గిరిజన శక్తి జిల్లా అధ్యక్షుడిగా రాంనాథ్ నాయక్



ముథోల్: గిరిజన శక్తి జిల్లా నూతన అధ్యక్షుడిగా బుధవారం భైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్, గిరిజన యువ నాయకులు రాంనాథ్‌నాయక్‌ను నియమించారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన రాంనాథ్‌నాయక్‌ను అధ్యక్షుడిగా నియమించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దొంగను పట్టుకున్న సిబ్బంది

ముథోల్: మండల కేంద్రంలో మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ ట్రాక్టర్ విడిభాగాలను దొంగలిస్తున్న ఓ వ్యక్తిని సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బుధవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన భూమేశ్.. పంచాయతీ ట్రాక్టర్ విడిభాగాలను ఎత్తుకెళ్తుండగా సిబ్బంది పట్టుకున్నారు. అంతకుముందు మండల కేంద్రంలో ని కోటగల్లీలో మరో ట్రాక్టర్ విడిభాగాలను తీసుకెళ్లి నట్లు ట్రాక్టర్ యజమాని ఫేరోజ్ పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

నిర్మల్‌టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్–17 విభాగంలో పట్టణానికే చెందిన విజయ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇందులో టి.శ్రీనిత్, ఉజ్వల్, సహస్ర ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



తేమ పరిశీలిస్తున్న ఏఈఓ ఉమామహేశ్వరి

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో నిర్మల్ ఎఫ్‌ఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏఈవో జాదవ్ ఉమామహేశ్వరి సందర్శించారు. ఈసందర్భంగా ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. అంతకుముందు బొప్పారంలో వేరుశెనగ పంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో రైతులు తదితరులున్నారు.

నిర్మల్‌వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ప్రకాశ్‌రావు

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లికి చెందిన పానుగోటి ప్రకాశ్ రావును వరల్డ్ కల్చరల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసింది. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రకాశ్‌రావుకు డాక్టరేట్‌ను రామాయణ సీరియల్‌లోని హనుమాన్ పాత్రధారి బిందు ధారాసింగ్ అందజేశారు. ప్రకాశ్‌రావు పేదలకు ఆర్థిక చేయూతనందించి వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు, సామాజిక దురాచారాలు, డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రకాశ్‌రావు సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా వరల్డ్ కల్చరల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్.. డాక్టరేట్‌తో గౌరవించింది.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గంగన్న కోడలు పల్లవి హఠాన్మరణం చెందారు. బుధవారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి వెంట పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన ఎప్పుడో..?

- తిర్పెల్లి, చామన్‌పెల్లి గ్రామాల్లో దెబ్బతిన్న లోలెవల్ వంతెనలు
- ఏటా వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



పై చిత్రంలో కనిపిస్తున్నది మండలంలోని తిర్పెల్లి పురాతన వంతెన. ఇది ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఏటా వర్షాకాలంలో దానిపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.



పై చిత్రంలో కన్పిస్తున్నది లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లి వాగుపై ఉన్న ఈ లోలెవల్ వంతెన. ఏటా వర్షాకాలంలో మునుగుతోంది. దీంతో రైతులు పొలాలకు వెళ్లిరావడం కష్టంగా ఉంటుంది.



పై చిత్రంలో కన్పిస్తున్నది లక్ష్మణచాంద మండలంలోని పీచర, ధర్మారం గ్రామాల నుంచి సోన్ మండలకేంద్రానికి వెళ్లే రోడ్డు. ఏటా భారీవర్షాలకు రోడ్డు, పైపులు కొట్టుకుపోయి ప్రజల రాకపోకలు నిలిచిపోతాయి. ఇక్కడ వంతెన నిర్మిస్తే ప్రజల కష్టాలు దూరమవుతాయి.

ఇబ్బంది అవుతుంది..



మా గ్రామమైన తిర్పెల్లి వెళ్లే మార్గంలో కనకాపూర్ వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఇటీవలి వర్షాలకు కూలిపోయింది. దీంతో ఇబ్బంది అవుతుంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.
– భీమేశ్, తిర్పెల్లి

వంతెన నిర్మాణం చేపట్టాలి



ఏటా వర్షాకాలం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటాం. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా..హైలెవల్ వంతెన నిర్మించడం లేదు. నూతన బ్రిడ్జి నిర్మించి మా కష్టాలు దూరం చేయాలి.
– మనోహర్, తిర్పెల్లి

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి, చామన్‌పెల్లి గ్రామాల వద్ద వాగుపై ఉన్న లోలెవల్ వంతెనలు శిథిలావస్థకు చేరాయి. లక్ష్మణచాంద నుంచి తిర్పెల్లి గ్రామం వెళ్లే మార్గంలో.. చామన్‌పెల్లి నుంచి అనంతపేట్ వెళ్లే మధ్య వాగుపై ఉన్న లోలెవల్ వంతెనలు ఇప్పటికే శిథిలావస్థకు చేరాయి. ఈ వంతెనలు ఎప్పుడు కూలిపోతాయోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని.. అధికారులు, ప్రభుత్వం స్పందించి లోలెవల్ వంతెనలున్న చోట హైలెవల్ వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో తప్పని తిప్పలు..

- ఏటా వర్షాకాలంలో తిర్పెల్లి గ్రామం పక్కనే ఉన్న కనకాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వాగుపై ఉన్న లోలెవల్ వంతెన నీట మునుగుతోంది. వాగు ప్రవాహం తగ్గే వరకు తిర్పెల్లి నుంచి మండల కేంద్రం వెళ్లేందుకు ప్రజల రాకపోకలు నిలిచిపోతాయి.
- చామన్‌పెల్లి వద్ద వాగుపై లోలెవల్ వంతెనపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నారు.
- పీచర నుంచి సోన్ మండలకేంద్రం వెళ్లే మార్గంలో పీచర సమీపంలో ఉన్న రోడ్డుపై లోలెవల్ వంతెన కొట్టుకుపోయింది. దీంతో పీచర, ధర్మారం గ్రామాల నుంచి సోన్ మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోతాయి.

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని తిర్పెల్లి, చామన్‌పెల్లి గ్రామాల వద్ద వాగుపై, పీచర సమీపంలో రోడ్డుపై హైలెవల్ వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే వంతెనలు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూస్తాం.
– అంజనేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఏఈ

పాఠశాలల్లో బాలల హక్కుల దినోత్సవం



సోన్: పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు



మామడ: కొరటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



తానూరు : ఎల్వి పాఠశాలలో..

నిర్మల్‌ఖిల్లా: చెడు అలవాట్లకు దూరం ఉండి.. మంచి అలవాట్లు అలవర్చుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరం ఉంటూ.. ఇంటర్‌నెట్‌ను సామాజిక వికాసానికే వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ పిల్లల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో నరేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడువ్యసనాలకు దూరం ఉంటూ ఉన్నతస్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, మాధవ్ రావ్, సుదర్శన్, సుజాత దేవి, రజనీకాంత్, రవీందర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలకు దూరం ఉండాలని ఉపాధ్యాయులు.. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పురుషోత్తం, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోన్: విద్యార్థులు సమాజాభివృద్ధి కోసం మంచి అలవాట్లను అలవర్చుకోవాలని మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న అన్నారు. బుధవారం పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలిన వంతెన పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



వంతెన వద్ద పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: మండలంలోని తిమ్మాపూర్ జోడు వాగులపై నిర్మించిన వంతెన గతేడాది కూలిపోయింది. వంతెన లేక ప్రజలు కష్టాలు పడుతున్న వైనంపై పట్టు తప్పితే.. అంతే..! అనే శీర్షికన ఈనెల19న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు బుధవారం అధికారులు కూలిన వంతెనను పరిశీలించారు. రైతులు వాగులో నుంచి ప్రమాదకరంగా వెళ్లవద్దని దూరమైనా.. చుట్టూ తిరిగి వ్యవసాయ పనులకు వెళ్లాలని సూచించారు. వంతెనను పరిశీలించిన వారిలో ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శి భోజన్న, రైతులు గంగాధర్‌పటేల్, మోహన్‌రెడ్డి, ముత్యం ఉన్నారు.

పనులు ప్రారంభం

ముథోల్: మండలకేంద్రం నుంచి పంచగూడ వరకు రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గత నెలలో ఎంపీ గొడం నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. సీఆర్‌ఐఎఫ్ కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.30కోట్లతో పనులు ప్రారంభించారు. పలువురు అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన జీపు వేలం

ముథోల్: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులు తిరిగిన వాహనం విక్రయించేందుకు బుధవారం వేలంపాట నిర్వహించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పాతబడిన జీపును తుక్కు కింద వేలం వేసినట్లు ఐసీడీఎస్ సీడీపీవో సరోజన తెలిపారు. 1992లో ఈ వాహనం ఐసీడీఎస్‌కు కేటాయించారు. వేలంలో ఏడుగురు వ్యాపారులు పాల్గొనగా.. ముథోల్‌కు చెందిన మజార్ అనే వ్యాపారుడు రూ.18వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది తదితరులున్నారు.

పలువురికి మధుమేహ నిర్ధారణ పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: రాంనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రం, లయన్స్ క్లబ్ నిర్మల్ ఆధ్వర్యంలో బుధవారం రాంనగర్ పరిధిలో ఉచితంగా మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మధుమేహ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఈనెల 19 నుంచి 25 వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ సభ్యులు మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం 48 మందికి పరీక్షలు నిర్వహించి అధికంగా బ్లడ్ షుగర్ ఉన్నవారికి వైద్యులు ఉచితంగా మందులు అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, క్లబ్ కోశాధికారి లక్ష్మి, నారాయణగౌడ్, ప్రోగ్రాం చైర్మన్ నేరెళ్ల హన్మంతు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి పి.రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

లక్ష్మణచాంద: ఐదు రకాల పథకాలు ప్రవేశపెట్టి.. ప్రజల సమస్యలు తీర్చాలని ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ సొన్న భీమేశ్ పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జానకికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేజీ టు పీజీ ఉచిత విద్య, వైద్యం, ప్రతి ఒక్కరికి ఉపాధి, భూమి ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పథకాలకు పూలే, సాహు మహరాజ్, అంబేద్కర్, కాన్షీరాం పేర్లు పెట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండి భూమేశ్,తొర్తి ముత్యం మహరాజ్, సంతోష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కాకడ హారతి



కాకడ హారతిలో పాల్గొన్న భక్తులు

తానూరు: మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢమాసం శుక్లపక్షంలో పౌర్ణమిరోజున ప్రారంభమైన కాకడహారతి బుధవారం ముగిసింది. ఉదయం ఆలయంలో సచిన్ పాఠక్ పూజారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజారి మాట్లాడుతూ ఆషాఢమాసం నుంచి కార్తీక మాసం వరకు నాలుగు నెలలపాటు భక్తిశ్రద్ధలతో తెల్లవారుజామున కాకడ హారతి నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సమగ్ర సర్వేకు సహకరించండి



కనకాపూర్‌లో సర్వే పరిశీలిస్తున్న అధికారులు

ఖానాపూర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి వివరాలు చెప్పాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని సుర్జాపూర్, రంగపేట గ్రామాల్లో డీఎల్‌పీవో సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. బుధవారం కనకాపూర్‌లో సర్వే జరుగుతున్న తీరును ఎంపీడీవో రాధ పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి అంబాజీ, ఎంపీవో అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

‘మాలల సింహగర్జనకు తరలిరావాలి’



సోన్‌లో మాట్లాడుతున్న వెంకటస్వామి

సోన్: అంబేద్కర్ సాక్షిగా ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని.. హైదరాబాద్‌కు నిర్వహించే మాలల సింహ గర్జనకు తరలిరావాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంట వెంకటస్వామి అన్నారు. బుధవారం గ్రామ అంబేద్కర్ యువజన సంఘం, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ అంశంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా వెంకటస్వామి హాజరై మాట్లాడారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన, మాలల ఆత్మ గౌరవసభకు మాలలు, మాల ఉపకులాలు తరలిరావాలని కోరారు.

అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సోన్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొంతకాంతయ్య, ఉపాధ్యక్షులుగా జానీ, కొత్రి ముత్యం, ప్రధాన కార్యదర్శిగా పట్టెపు హరీశ్, సంయుక్త కార్యదర్శిగా కొంతం సాగర్, కోశాధికారిగా గంగారపు నవీన్, ప్రచార కార్యదర్శిగా బక్కూరి రవి, గౌరవ సలహాదారులుగా ఆరే జువ్వన్న, గోలి రాజేశ్వర్, పట్టెపు నడిపి పోశెట్టి, దండు భోజన్న, ఆరే వెంకటి, గంగారపు చిన్నరాజన్న, గంగారపు చిన్నదేవన్న ఎన్నికయ్యారు.

కంకి తింటూ.. కబుర్లు చెబుతూ



ఉడుంపూర్‌లో కంకి తింటున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

కడెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సామాన్యులను అడిగి తెలుసుకుంటున్నారు. బుధవారం దస్తురాబాద్ పర్యటన ముగించుకొని ఉట్నూర్ వెళ్తుండగా కడెం మండలంలోని ఉడుంపూర్ సమీపంలో ఓ మొక్కజొన్న కంకుల దుకాణం వద్ద ఆగారు. అక్కడున్న వారిని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా ? అని పలువురిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు నమూనా ఎన్నికలు



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఓటర్లుగా మారి ఓటుహక్కు వినియోగించున్నారు. మరికొందరు విద్యార్థులు ఎన్నికల అధికారులుగా విధులు నిర్వర్తించారు. ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికలు, ఓటుహక్కు ప్రాధాన్యత వివరించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేశ్, శ్రీనివాస్, హేమలత, మల్లేశ్, రాజేశ్వర్, రాహుల్, పవిత్ర, సతీశ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయానికి చేరిన పుస్తకాలు



వాహనం నుంచి పుస్తకాలు దించుతున్న సిబ్బంది

భైంసారూరల్: భైంసాలోని మండల విద్యా వనరుల కేంద్రానికి బుధవారం పాఠ్యపుస్తకాలు చేరాయి. 2024–25 విద్యాసంవత్సరంలో మొదటి భాగం బోధన పూర్తయింది. విద్యాశాఖ రెండోభాగం సుమారు 16వేల పాఠ్యపుస్తకాలు అందినట్లు ఎంఈఓ సుభాశ్ తెలిపారు.

దీక్షలు స్వీకరణ



అయ్యప్ప ఆలయంలో దీక్షాపరులు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఉన్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో బుధవారం పలువురు దీక్ష స్వీకరించారు. దీంతో ఆలయం స్వాములతో కిటకిటలాడింది. గురుస్వామి నర్సారెడ్డి మాలధారణ మంత్రం చెప్పి.. అయ్యప్ప భక్తులకు మాలలు వేశారు. అనంతరం పాటించాల్సిన నియమాల గురించి వివరించారు.

బ్యాగులు, నోట్‌బుక్‌లు పంపిణీ

దిలావర్‌పూర్: మండలంలోని బన్సపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పీఎంకే సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బోధనా పరికరాలు, బ్యాగులు, నోట్‌బుక్‌లు అందజేశారు. సంస్థ ప్రతినిధి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.లక్ష విలువ చేసే బ్యాగులు, నోట్‌బుక్‌లు అందజేసినట్లు వెల్లడించారు. ఇందులో ఉపాధ్యాయులు, పీఎంకే సిబ్బంది భరత్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కార్యాలయం



భైంసారూరల్: భైంసా మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండి ఉంది. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని చెప్పే అధికారుల కార్యాలయమే ఇలా అపరిశుభ్రంగా దర్శనమిస్తుండటం గమనార్హం.